## క్లుప్తంగా

### అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

దామెర : అసత్య ప్రచారాలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దని ప్రజలను కోరారు. జరగని విషయాలు జరిగినట్లుగా వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేయొద్దన్నారు. అలా ఎవరైనా చేసినట్లైతే ఫార్వర్డ్ చేసిన వ్యక్తితో పాటు గ్రూప్ అడ్మిన్‌పై కేసు నమోదు చేస్తామని ఆ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

### పరీక్ష సామగ్రి పంపిణీ



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు హనుమకొండకు చెందిన జయపాల్ టీచింగ్ కళాశాల అడ్మినిస్టర్ జ్యోతివాసుదేవారెడ్డి పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సుమారు వందమంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కేల్స్‌తో పాటు ఇతర సామగ్రి అందించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్ష సమయం సమీపిస్తున్నాకొద్ది చదువుపై మరింత ఏకాగ్రత సారించాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి 10జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనితాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

### వైభవంగా సమతార్యాలీ



ఆత్మకూరు : మండల కేంద్రంలో సోమవారం వికాసతరంగిణి మండలశాఖ ఆధ్వర్యంలో సమతార్యాలీ వైభవంగా జరిగింది. ఇంటింటి నుంచి బియ్యాన్ని సేకరించి కలశంలో పోశారు. ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లో సమతామూర్తి కేంద్రం వద్ద రామానుజుడికి అభిషేకం చేయనున్నట్లు నిర్వాహకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి, వికాసతరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ టింగిలికారి సత్యనారాయణ, నాగబండి శివప్రసాద్, పోలు రాజేష్‌కుమార్, వంగాల బుచ్చిరెడ్డి, పరికిరాల వాసు, కొండబత్తుల వేణుగోపాల్, గుండెబోయిన కుమార్, రఘుపతిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, పుష్పక్క, మంజుల, రూప, రేణుక, కవిత, ఊర్మిళ పాల్గొన్నారు.

### అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

కమలాపూర్ : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) అశోక్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని మండల పరిధిలోని కన్నూరుకు చెందిన పాత్రికేయుడు పెర్క రమాకాంత్ కోరారు. ఈమేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

### టిప్పర్ పట్టివేత

వేలేరు : మండలంలోని లోక్యతండా శివారు నుంచి వేలేరుకు అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై హరిత తెలిపారు. సంబంధిత టిప్పర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మొరం, ఇసుక తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎల్కతుర్తి : మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన సుంకనపల్లి దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి 50కిలోల బియ్యం అందించారు.

### డీఎల్పీఓ విచారణ

దుగ్గొండి : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌పై గ్రామానికి చెందిన శ్రవణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్పీఓ పవన్ సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో శ్రవణ్, రాజేంద్రప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలాలను నమోదు చేశారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

# బీటీరోడ్డు మరమ్మతుకు మోక్షమెప్పుడో..?

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదా..?
- తేలిన కంకర.. అదుపుతప్పుతున్న బైక్‌లు
- 9నెలల నుంచి ప్రయాణికుల ఇబ్బందులు



కాంట్రపల్లి, ప్రగతిసింగారం గ్రామాల మధ్య కంకర తేలిన బీటీ రోడ్డు

శాయంపేట : కంకర తేలిన బీటీ రోడ్డుపై నడక నరకప్రాయంగా మారుతోంది. ఆ రోడ్డుగుండా వెళ్లే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులకు చలనం లేదు. మండలంలోని కాంట్రపల్లి–ప్రగతిసింగారం గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. గతేదాది కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహానికి 500 మీటర్ల మేర బీటీ రోడ్డు వరదకు కొట్టుకుపోయి కంకర తేలింది. దీంతో ఆ దారిగుండా వెళ్లే వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు కొట్టుకుపోయి 9నెలలు గడుస్తున్నా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాట్రపల్లి, నూర్జహాన్‌పల్లి, గొల్లపల్లి, రాజుపల్లి, సాధోనిపల్లి, మల్లంపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఈ దారిగుండా ప్రయాణిస్తూ ఉంటారు. ద్విచక్ర వాహనదారులు కంకర తేలిన రోడ్డుపై వాహనాలను నడపలేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి ప్రమాదాలు జరుగకముందే చర్య చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## బావి వద్ద ఆరబెట్టిన మిర్చి మాయం



మిర్చి పంట వద్ద రోదిస్తున్న రైతు

ధర్మసాగర్ : ఆరబెట్టిన మిర్చి మాయమైందని ఓ రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన బావి వద ఆరబెట్టిన సమారు 5 బస్తాల మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని మండల కేంద్రానికి చెందిన రైతు తోకల విజయపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని పల్లెబండ శివారులో తనకు వ్యవసాయ భూమి ఉందని చెప్పారు. అందులో 0.30 గుంటల మిర్చి పంట వేసి గత 20 రోజుల క్రితం మిరపకాయలు ఏరి బావి వద్ద ఆరబెట్టానని తెలిపారు. వారం క్రితం మిర్చిని కుప్పగా చేసి టార్పాలిన్ కప్పానని అయితే, సోమవారం బావి వద్దకు వెళ్లి ఆ మిర్చి కుప్పను పరిశీలించగా మిరపకాయలు తీసినట్టు ఆనవాళ్లు కనిపించయాలని అన్నారు. దాదాపు 30వేల మిర్చి బస్తాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు వాపోయాడు. గతంలో కూడా తమ ట్రాక్టర్ కల్టీవేటర్ దుంపలు, చొప్ప కటింగ్ మోటార్, వ్యవసాయ పనిముట్లు ఎత్తుకెళ్లారని వాపోయాడు. ఆ సమయంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. తమ మిర్చి పంటను చోరీ చేసిన వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు.

### పాముకాటుతో వృద్ధురాలి మృతి



సరోజన (ఫైల్)

శాయంపేట : వంటగదిలోని సెల్ఫ్‌లో దాగిఉన్న పాము వృద్ధురాలిని కాటువేసింది. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దుంపల సరోజన(79) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంది. ఇంట్లో వంట చేస్తుండగా సెల్ఫ్‌లో దాగివున్న పాము సరోజన కుడిచెయ్యి వేలికి కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. సరోజన పెద్ద కుమారుడు దుంపల సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గీసుకొండ : మండలంలోని పోతరాజుపల్లికి చెందిన ఊగ రాణికి ఆమె పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఐ బాబూలాల్ సోమవారం అప్పగించారు. రాణి రెండు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌ను పోలీసులు గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు.

## బాలలకు పోలియో చుక్కలు తప్పనిసరి



దుగ్గొండి : సమీక్షిస్తున్న ఎంపీపీ కోమల

దుగ్గొండి : ఐదేళ్లలోపు బాలలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఎంపీపీ కాట్ల కోమల కోరారు. పోలియో చుక్కల కార్యక్రమంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. మార్చి 3న గ్రామాల్లో పోలియో చుక్కలు వేసేలా పని చేయాలని కోరారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్ రాజ్, డిప్యూటీ తహసీల్దార్ ఉషారాణి, ఎంపీటీసీ మోర్తాల రాజు, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : మాట్లాడుతున్న డాక్టర్ సరోజ

### టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం

చెన్నారావుపేట : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గోవింద్‌రావు అధ్యక్షతన మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఐదేళ్లలోపు చిన్నారులు 2123 మంది ఉన్నారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ రత్నమాల, ఎంపీఓ శ్రీధర్‌రాజు, కార్యాలయ సూపరింటెండెంట్ దయాకర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### కమిటీల ఎన్నిక

నర్సంపేట : తెలంగాణ ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ డివిజన్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గోనె యువరాజు, పాలడుగుల రమేశ్, అధ్యక్షుడిగా నాలం రాజు, ఉపాధ్యక్షులుగా బొల్లెపల్లి నగేశ్, లక్క రాజు, పెంతల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వనపర్తి భిక్షపతి, సహాయ కార్యదర్శులుగా నిమ్మనబోయిన ప్రభాకర్, ఎల్లబోయిన రమేశ్, మామిండ్ల రాజు, కోశాధికారిగా ఎర్ర నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా పాశం మల్లికార్జున్, గట్టికొప్పుల రంజిత్, కొత్త హరిబాబు, కొయ్యల రాజు ఎన్నికయ్యారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్ల, క్లీనర్ల సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్క రాజు, డివిజన్ కార్యవర్గ సభ్యులుగా పాశం మల్లికార్జున్, సభ్యులుగా భాగవత రమేశ్, టేకుల స్వామి, రఘు, అనిల్‌కుమార్, సునీల్, స్వామి ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన రాజును సన్మానించారు.

కంఠమహేశ్వరస్వామి, ఎల్లమ్మ..

పర్వతగిరి : మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి, ఎల్లమ్మ, మైసమ్మ ఉత్సవ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పుల్లూరి సారయ్యగౌడ్, రంగు జనార్దన్, అధ్యక్షుడిగా తీగల వీరస్వామి, ఉపాధ్యక్షులుగా రంగు కుమారస్వామి, దొనికన దయాకర్, రంగు కుమార్, ప్రధాన కార్యదర్శులుగా చీకటి యాకయ్య, చిర్ర గణేశ్, సభ్యులుగా ముంజ శ్రావణ్, పంజాల మహేశ్, పుల్లూరి పరమేశ్, మడ్డి రాజు, మడ్డి నాగరాజు, రంగు అఖిల్, చీకటి రాజేష్, బంధారపు రంజిత్, పుల్లూరి దిలీప్, చిర్ర శేఖర్, బత్తిని రాజు ఎన్నికయ్యారు.

సంఘమేశ్వరాలయ..

సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వరాలయ ఉత్సవ కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షుడు, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య ప్రకటించారు. అధ్యక్షుడుగా కందకట్ల నరహరి, ప్రధాన కార్యదర్శిగా ఆగపాటి రాజు, ఉపాధ్యక్షులుగా మునుకుంట్ల కోటేశ్వర్, కక్కెర్ల శరత్, చంద్రశేఖర్, మల్లికార్జున్, ఎల్లయ్య, భాస్కర్, రాజ్‌కుమార్, కోశాధికారిగా మోహన్, లవ్‌కుమార్, రామకృష్ణ, కొమురయ్య, ఆర్గనైజర్లుగా కుమార్, స్వాగత్, శ్రావణ్ ఎన్నికైనట్టు తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుగ్గొండి : విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ మండలంలోని రేకంపల్లి గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ పబ్లిక్ స్కూల్‌లో సందడి నెలకొంది. ఆ స్కూల్‌లో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడిగా గట్టికొప్పుల శ్రీలక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులుగా స్నేహ, రక్షిత్, శరత్, వైష్ణవి, సుశాంత్, నేహ, కౌశిక్, సిద్ధు, సుశాంత్, యశ్వంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా తరగతులు బోధించిన విద్యార్థులను హెచ్ఎం గట్టికొప్పుల విజేందర్ అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధిక, జీవన్, కొంరయ్య, సుధాకర్, ప్రవళిక, శ్రావణి పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధిలో కౌన్సిలర్లు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : పట్టణ అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కీలకమని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కౌన్సిలర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో పట్టణాభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేయించగా పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కౌన్సిలర్లు అధికారులతో సమన్వయం చేసుకుని వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు జరిగేలా చొరవ చూపాలని సూచించారు. లేనిపక్షంలో నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. కౌన్సిలర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. తద్వారా పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు పద్మ ప్రసాద్, సునీత రఘునాథ్, రుద్ర మల్లీశ్వరి ఓంప్రకాశ్, వేల్పుగొండ పద్మ రాజు, దేవోజు తిరుమల సదానందం, గందె రజిత చంద్రమౌళి, ఇందిర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సంఘం అభివృద్ధికి సహకరించండి

చెన్నారావుపేట : శ్రమశక్తి పురుషుల సంఘం అభివృద్ధికి సభ్యులు సహకరించాలని భారతీయ పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకార పరిమితి సమితి అధ్యక్షుడు నూనె కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలో అధ్యక్షుడు ముత్యం సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన శ్రమశక్తి పురుషుల సంఘం 24వ వార్షిక మహాసభకు కుమారస్వామి హాజరై మాట్లాడారు. 24 ఏళ్ల క్రితం 175 మందితో ప్రారంభించిన సంఘం 634 మందికి చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సభ్యులు అప్పును సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. అనంతరం పదవి విరమణ పొందిన ముత్యం సాంబయ్య, శ్రీరామోజు ఉపేంద్రచారిలను సన్మానించారు. మహాసభలో ఉపాధ్యక్షుడు దొంతి సాయిలు, పాలకవర్గ సభ్యులు ఉపేంద్రచారి, ఎడ్ల రమేశ్, దొనికెల వీరయ్య, పులి రమేశ్, సూత్రపు సుధాకర్, జెట్టబోయిన వీరభద్రయ్య, రమేశ్, తౌటి రవి, ఘణకుడు బొనగాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



పర్వతగిరి : రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ శంకర్ స్పష్టం చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని చెడిపోయిన బోర్‌బావులు, మోటార్లకు మరమ్మతు చేయించాలని చెప్పారు. అలాగే పైపులైన్ల, గేట్‌వాల్వ్‌ల లీకేజీల సమస్యలనూ సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని, పల్లెల్లో పనులు చేపట్టాలని, పని ప్రదేశాల్లో మౌలిక వసతుల కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

## శివాలయ నిర్మాణంతో పూర్వవైభవం



యాగశాల పనులను పరిశీలిస్తున్న శేషు

దామెర : కాకతీయులనాటి శివాలయంను పునర్నిర్మించడంతో గ్రామంలో పూర్వవైభవం సంతరించుకుంటుందని భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు అన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివాలయం పునఃప్రతిష్ఠాపనలో భాగంగా ఈనెల 29వ తేదీన అంకురార్పణ, మార్చి1న యాగారంభం, జలాధివాసం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 3న (ఆదివారం) ఉదయం 9.45 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహాకుంభాభిషేకం కార్యక్రమాలను గన్నవరం శ్రీభువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతిస్వామి వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు ప్రముఖ న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి, శివం ట్రస్టు చైర్మన్ బిల్లా రమణారెడ్డి, సభ్యులు గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, అర్చకులు రాజుశర్మ, సుబ్బయ్యశర్మ, గ్రామ పెద్దలు పోల్సాని శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి (బంగ్ల రామన్న) శంకర్, కుమార్, పోచయ్య, భిక్షపతి, నాగేశ్వర్ రావు, రవి, కొమ్మాలు తదితరులు ఉన్నారు.

## అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్ఎస్ నాయకులపై బనాయించిన అక్రమ కేసులు, థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకొని, కేసులను ఎత్తివేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో బుధవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. హనుమకొండలోని ఆయన నివాసగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అకారణంగా చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు ఈ ధర్నాలో పాల్గొననున్నట్లు తెలిపారు. ధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వరంగల్ రెడ్‌క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సంగెం జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, దామెర వైస్‌ఎంపీపీ జాకీర్‌అలీ, నాయకులు గోల్కొండ శ్రీనివాస్ రమేష్ పాల్గొన్నారు.

## ప్రజాహిత యాత్రకు తరలిరావాలి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

కమలాపూర్ : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా రెండో విడత ప్రజాహిత యాత్రకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 28, 29 తేదీల్లో మండలంలో యాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు. సోమవారం పార్టీ నాయకుడు ఈటల రాజేందర్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్ ప్రజాహిత యాత్ర ఈ నెల 28న మండలంలోని దేశరాజుపల్లిలో ప్రారంభమై కానిపర్తి, కమలాపూర్ గ్రామాల్లో కొనసాగుతుందని, కమలాపూర్‌లో రాత్రి బస చేస్తారని అన్నారు. అనంతరం 29న వంగపల్లి, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో యాత్ర ఉటుందన్నారు. ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని, యాత్ర ప్రారంభం నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. తెలంగాణతో పాటు దేశమంతా మోదీ నినాదం మారుమోగుతోదన్నారు. దేశ రక్షణ, దేశ సమగ్రత, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మోదీ చేసిన పనులు, సాధించిన విజయాలు, ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టిన అంశాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకుని మరోసారి మోదీని ప్రధానమంత్రిగా చేయడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, అసెంబ్లీ కోకన్వీనర్ మాట్ల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు భిక్షపతి, నాయకులు అరవింద్, రత్నాకర్, కోటేశ్వర్, శ్రీనివాస్, కల్యాణ్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరకాల : ఈనెల 29న పట్టణంలో జరుగనున్న విజయసంకల్పయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆ పార్టీ నియోజవర్గ కార్యాలయంలో విజయసంకల్పయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, కౌన్సిలర్స్ బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, పట్టణ ప్రధానకార్యదర్శి గాజుల నిరంజన్, పట్టణ ఉపాధ్యక్షుడు నాగెల్లి రంజిత్, సంఘ పురుషోత్తం, మామిల్లపల్లి సారంగపాణి పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ కో ఆర్డినేటర్లు

కమలాపూర్ : సాక్షరభారత్ మాజీ కోఆర్డినేటర్లకు ఉద్యోగావకాశాలు కల్పించాలని హనుమకొండ జిల్లాకు చెందిన సాక్షరభారత్ మండల, గ్రామాల మాజీ కోఆర్డినేటర్లు కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు వినతిపత్రం అందించారు. గతంలో తొమ్మిదేళ్ల అక్షరాస్యత కార్యక్రమంతో పాటు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకున్న తమకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు. సాక్షరభారత్ కోఆర్డినేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నద్దునూరి సదానందం, మాజీ ఎంసీఓలు వేల్పుల రాజు, నేపాల్‌రెడ్డి, దాసరి సబిత, కొయ్యడ దేవరాజు, సదయ్య, మొగిలి, ప్రకాశ్, రవీందర్, అరుణ, శైలజ, శ్రీలత పాల్గొన్నారు.

## శ్మశానవాటిక నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

పరకాల : పట్టణంలోని చలివాగు పంప్‌హౌజ్ వద్ద జరుగుతున్న శ్మశానవాటిక నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సోమవారం మున్సిపల్ పాలకవర్గసభ్యులతోపాటు కమిషనర్ నర్సింహ, ఏఈ వంశీకృష్ణ శ్మశానవాటిక నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే పనులు పూర్తి చేయాలని అన్నారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేవూరి విజయ్‌పాల్‌రెడ్డి, సోదా రామకృష్ణ పాల్గొన్నారు.